తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
హైదరాబాద్ - రంగారెడ్డి
మేడ్చల్ మల్కాజిగిరి వికారాబాద్
గురువారం 28 మే 2026 | పేజీలు : 08



Follow :



- మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి
- మిల్లులకు వచ్చిన ధాన్యాన్ని వెంటనే అన్ లోడింగ్ చేసుకోవాలి
- రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి నారాయణరెడ్డి

# తడిసిన ధాన్యాన్ని తప్పకుండా కొంటాం

## రాజకీయ లబ్ది కొరకే ప్రతిపక్షాల రాద్ధాంతం

తడిసిన ధాన్యాన్ని తప్పకుండా కొనుగోలు చేస్తామని ,రైతులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. కొనుగోలు చేసిన తడిసిన ధాన్యాన్ని సత్వరమే బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలిస్తున్నామన్నారు. అకాల వర్షాలకు తడిసిన 9,214 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఇప్పటికే బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించినట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. అకాల వర్షాలు సంభవించడంతో ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఉత్పన్నమయిన పరిణామాలను సమీక్షించేందుకుగాను మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి అత్యవసరంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావుతో కలిసి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో పాటు మంత్రివర్గ సహచరులు, పౌర సరఫరాల శాఖా కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టర్లు, పోలీస్ అధికారులు, రవాణా శాఖాధికారులతో పాటు పౌర సరఫరాల శాఖాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ రాష్ట్ర రైతాంగానికి నష్టం వాటిల్లే ఏ చర్యలను ప్రభుత్వం చూస్తూ ఊరుకోబోదన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం రంగారెడ్డి కలెక్టర్ సి నారాయణరెడ్డి సంబంధిత అధికారులతో మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభం కానున్న నేపథ్యంలో జిల్లాలో కొనుగోలు చేసిన ధాన్యాన్ని త్వరగా మిల్లులకు పంపేందుకు వాహనాలను సిద్ధం చేసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మిల్లర్లు మిల్లులకు వచ్చిన ధాన్యాన్ని వెంటనే అన్లోడింగ్ చేసుకోవాలని సూచించారు. మిల్లర్లు ధాన్యాన్ని అన్లోడింగ్ చేసుకోనట్లయితే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ధాన్యాన్ని తరలించేందుకు అవసరమైన వాహనాలను సిద్ధంగా ఉంచుకోవాలని, ధాన్యాన్ని తరలించే ప్రక్రియను వేగవంతం చేయాలని, నిర్దేశించిన సమయంలో పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు తెలిపారు. అదనపు కలెక్టర్ చంద్రా రెడ్డి, సివిల్ సప్లయ్ అధికారులు వనజాత, హరీష్, వ్యవసాయ శాఖ అధికారి ఉష, పిడిడిఆర్ డి ఎ శ్రీలత, ట్రాన్స్ పోర్ట్ అధికారి సదానందం, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు. - రంగారెడ్డి ప్రతినిధి, మే 27 (జనంసాక్షి) :

## బోడుప్పల్ సర్కిల్ భూముల్లో అవకతవకలు

### లోకాయుక్తను ఆశ్రయించిన సామాజిక కార్యకర్త మరాటి మల్లేష్




**బోడుప్పల్-జనంసాక్షి :** బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని సర్వే 65లోని భూముల రిజిస్ట్రేషన్, నిర్మాణపు అనుమతులలో జరిగిన అవకతవకలపై విచారణ జరపాలని కోరుతూ సామాజిక కార్యకర్త మరాటి మల్లేష్ బుధవారం లోకాయుక్తను ఆశ్రయించాడు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ మేడ్చల్ మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బోడుప్పల్ సర్కిల్ సర్వే నెంబరు 65లో ఒక స్థలం విషయంలో తప్పుడు పత్రాలను ఉపయోగించి రిజిస్ట్రేషన్లు చేయించడంతో పాటు నిర్మాణపు అనుమతులు పొందారనే అనుమానాలు వ్యక్తం చేశారు. ఈ విషయంలో ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం అంశంలో పూర్తి నష్టం జరిగిందని ఆయన పేర్కొన్నారు.





- ఇప్పటికే వేలకోట్ల రూపాయల భూమిని కబ్జాకోరల నుండి విడిపించిన వైనం
- భూముల పరిరక్షణలో 'జనంసాక్షి'ది క్రియాశీల సామాజిక పాత్ర
- సిపిఎం నేత చల్లా ది మరువలేని పాత్రే...

# శేరిలింగంపల్లిలో హైడ్రాకు జననీరాజనం



# బదిలీ నిబంధనలను తుంగలో తొక్కుతున్న అధికారులు

## టీజీఈ జేఏసీ తీవ్ర వ్యతిరేకం

- జీవో 38ను ఉల్లంఘిస్తున్న ఉన్నతాధికారులు
- 40 శాతం పరిమితి మించి బదిలీలు
- ఆయుష్, సంక్షేమ శాఖల్లో అనియమాలు
- ప్రభుత్వ ఉత్తర్వులు అమలు చేయాలని డిమాండ్

# ఉప్పల్ బాగాయత్‌కు అభివృద్ధి మహర్దశ

- త్వరలో సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఎంఎంసీ కార్పొరేషన్ భవనానికి భూమి పూజ
- విస్తారమైన స్థలాల్లో ఎంఎంసీ కార్యాలయ విస్తరణకు అపార అవకాశాలు
- ఎత్తైన ప్రాంతంగా ఉండటంతో ట్రాఫిక్ రద్దీ, వరద సమస్యలకు దూరంగా ఉప్పల్ బాగాయత్
- రూ.3.10 కోట్లతో ప్రహారీ గోడలు-రూ.10 కోట్లతో స్పోర్ట్స్ కాంప్లెక్స్-రూ.3.5 కోట్లతో కమ్యూనిటీ హాల్



**ఉప్పల్, మే 27 (జనం సాక్షి):** హైదరాబాద్ నగర పరిసర ప్రాంతాల్లో వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతాల్లో ఉప్పల్ బాగాయత్ ఒకటిగా నిలుస్తోందని, రాబోయే రోజుల్లో ఈ ప్రాంతం పరిపాలనా, క్రీడా, సామాజిక రంగాల్లో కీలక కేంద్రంగా మారబోతుందని ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన ఉప్పల్ బాగాయత్ ప్రాంతంలో విస్తృతంగా పర్యటించి జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఉప్పల్ బాగాయత్‌లో మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ) నూతన భవన నిర్మాణానికి త్వరలోనే ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి చేతుల మీదుగా భూమి పూజ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు కోసం 10 ఎకరాల విస్తీర్ణంలో స్థలాన్ని కేటాయించడంతో పాటు రూ.100 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసినట్లు వెల్లడించారు. ఎంఎంసీ కార్యాలయం నిర్మాణం పూర్తయితే ఉప్పల్ బాగాయత్ ప్రాంతానికి ప్రత్యేక గుర్తింపు రావడంతో పాటు పరిపాలనా పరంగా మరింత ప్రాధాన్యం పెరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా ఉప్పల్ బాగాయత్‌లో విస్తారంగా ఖాళీ స్థలాలు అందుబాటులో ఉండటంతో భవిష్యత్తులో ఎంఎంసీ కార్యాలయాన్ని మరింత విస్తరించే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. పరిపాలనా విభాగాలు, ప్రజా సేవా కేంద్రాలు, సమావేశ హాళ్లు, పార్కింగ్ సదుపాయాలు, పౌర సేవలకు సంబంధించిన విభాగాలను ఒకే ప్రాంతంలో అభివృద్ధి చేసే అవకాశం ఉందన్నారు. దీనివల్ల ప్రజలకు సేవలు మరింత వేగంగా అందే అవకాశముందని చెప్పారు. అదేవిధంగా ఉప్పల్ బాగాయత్ ప్రాంతం భౌగోళికంగా ఎత్తైన ప్రాంతంలో ఉండటంతో నగరంలోని ఇతర ప్రాంతాలతో పోలిస్తే ట్రాఫిక్ రద్దీ, నీటి నిల్వలు, వర్షాకాల ఇబ్బందులు, వరద సమస్యలు తక్కువగా ఉంటాయని పేర్కొన్నారు. ప్రశాంత వాతావరణం, విస్తారమైన రహదారులు, పరిశుభ్రమైన వాతావరణం, భవిష్యత్తు అభివృద్ధికి అనుకూలమైన భూములు ఉండటంతో ఈ ప్రాంతం భవిష్యత్తులో అత్యంత ప్రీమియం జోన్‌గా మారే అవకాశాలు ఉన్నాయని అన్నారు. "ఉప్పల్ బాగాయత్‌కు ప్రస్తుతం ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోంది. నగర విస్తరణలో భాగంగా ఈ ప్రాంతాన్ని మోడల్ డెవలప్‌మెంట్ జోన్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నాం" అని పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. ఖాళీ ప్రభుత్వ స్థలాలను ఆక్రమణల నుంచి రక్షించేందుకు రూ.3.10 కోట్ల వ్యయంతో భారీ ప్రహారీ గోడల నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. ఈ సందర్భంగా జరుగుతున్న ప్రహారీ గోడల నిర్మాణ పనులు, కొత్తగా ఏర్పాటు చేస్తున్న బోర్‌వెల్ పనులను పరిశీలించి నాణ్యతతో పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఇందులో భాగంగా త్వరలోనే రూ.10 కోట్లతో ఆధునిక మల్టీలెవల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. యువతకు క్రీడల్లో మెరుగైన అవకాశాలు కల్పించేందుకు ఇండోర్ స్టేడియంలు, ఫిట్‌నెస్ సెంటర్లు, మినీ క్రీడా వేదికలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. అలాగే స్థానిక ప్రజలకు వివాహాలు, సమావేశాలు, సామాజిక కార్యక్రమాలకు ఉపయోగపడేలా రూ.3.5 కోట్లతో అత్యాధునిక కమ్యూనిటీ హాల్ నిర్మించనున్నట్లు వెల్లడించారు. ఇక రోడ్ల విస్తరణ, సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ బలోపేతం, తాగునీటి సౌకర్యాలు, పార్కుల అభివృద్ధి, ఎల్ఈడి వీధి దీపాల ఏర్పాటు, పచ్చదనం పెంపు వంటి పనులను కూడా దశలవారీగా చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రతి కాలనీకి సమాన అభివృద్ధి అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు."రేవంతన్న మార్క్ అభివృద్ధి అంటే మాటలు కాదు... పనులు. ఉప్పల్ బాగాయత్‌ను రాష్ట్రంలోనే అత్యుత్తమ అభివృద్ధి చెందిన ప్రాంతంగా నిలబెట్టే వరకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుంది" అని పరమేశ్వర్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ భగాయత్ కాలనీ వాసులు వక్కంటి శ్రీనివాస్ రావు, బిజ్జుల రవీందర్ రెడ్డి, వంశీ చందర్ రెడ్డి, గోనె అర్జున్ రెడ్డి, విశ్వనాథ్, ఈగ సంతోష్ ముదిరాజ్, పూజల ప్రభాకర్, విప్లవ్ రెడ్డి, శివ ప్రసాద్ రావు, రావళి, స్వప్న, సుజాత, సూర్యగోపాల్, చారి, మూర్తి, మనోహర్ రెడ్డి, మహేష్, మురళి, రాఘవేంద్ర రెడ్డి, మల్లికార్జున్, సందీప్, యాదవల్లి రాజు, శ్రీనాథ్ రావు, శ్రీధర్ రెడ్డి, వెంకటయ్య, సల్ల ప్రభాకర్ రెడ్డి, లింగంపల్లి రామకృష్ణ, తుమ్మల దేవి రెడ్డి, మంద మురళి కృష్ణారెడ్డి, వరకల మదన్ గౌడ్, ఖాజా మౌలానా, అలుగుల అనిల్, వెంకటేశ్, బీమ్ సేన్, ఉపేందర్, నాగి రెడ్డి, లింగ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# యాచారం - నందివనపర్తి రహదారిపై ప్రయాణం నరకప్రాయం





**యాచారం, మే 27(జనం సాక్షి )** యాచారం నుంచి నందివనపర్తి గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి దుస్థితి రోజురోజుకూ మరింత దయనీయంగా మారుతోంది. నిత్యం వందలాది మంది ప్రయాణించే ఈ కీలకమైన రోడ్డుపై కనీసం నడవలేని పరిస్థితి ఏర్పడిందని స్థానిక కాలనీవాసులు, ప్రయాణికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డు సమస్యను పరిష్కరించాలంటూ ఇటీవల కాలనీవాసులంతా ఏకమై స్థానిక ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డికి, ఎంపీడీవో రాధారాణికి వినతిపత్రాలు సమర్పించినప్పటికీ అధికారుల్లో కానీ, ప్రజాప్రతినిధుల్లో కానీ ఎలాంటి చలనం లేకపోవడం గమనార్హం. వినతులు స్వీకరించిన పాలకులు సమస్యను గాలికొదిలేశారని కాలనీవాసులు ఆవేదన చెందుతున్నారు. తాత్కాలిక ఉపశమనం కోసం అధికారులు గతంలో నామమాత్రంగా రోడ్డుపై కంకర పరిచి చేతులు దులుపుకున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఆ పనులను కూడా సగంలోనే నిలిపివేయడంతో సమస్య మరింత జటిలమైంది. రోడ్డుపై పెద్ద పెద్ద కంకర రాళ్లు తేలి ఉండటం వల్ల ద్విచక్ర వాహనదారులు నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ఈ రోడ్డుపై ప్రయాణించాలంటే వాహనదారులు ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకోవాల్సి వస్తోంది. చీకట్లో కంకర రాళ్లు కనిపించక బైక్‌లు స్కిడ్ అయి ఎంతో మందికి తీవ్ర గాయాలయ్యాయని, అయినా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు. స్వల్ప వర్షం పడినా ఈ రోడ్డు పరిస్థితి మరీ దారుణంగా మారుతోంది. కంకర పోసిన చోట భారీగా బురద పేరుకుపోయి, రోడ్డంతా చెరువులను తలపిస్తోంది. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, అత్యవసర వైద్యం కోసం ఆసుపత్రులకు వెళ్లే గర్భిణీలు, వృద్ధులు ఈ బురద రోడ్డులో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆటోలు, ఇతర వాహనాలు సైతం ఈ గుంతల్లో దిగబడిపోవడంతో గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోతోంది. పాలకుల నిర్లక్ష్యానికి తామెందుకు బలికావాలని కాలనీవాసులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి వెంటనే శాశ్వత ప్రాతిపదికన బీటీ రోడ్డు పనులు పూర్తి చేయాలని, లేనిపక్షంలో నేరుగా జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి ఆందోళనలు ఉధృతం చేస్తామని గ్రామస్తులు హెచ్చరించారు అధికారులు స్పందించకుంటే కలెక్టరేట్‌ను ముట్టడిస్తాం. జానీ, బిఆర్ఎస్ యాచారం మండల యూత్ అధ్యక్షులు, యాచారం - నందివనపర్తి రోడ్డు దుస్థితిపై ప్రజాప్రతినిధులకు, అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా లాభం లేకుండా పోయింది. నామమాత్రంగా కంకర పోసి పనులు ఆపేయడం వల్ల నిత్యం బైక్‌లు స్కిడ్ అయి కాలనీవాసులు ప్రమాదాల బారిన పడుతున్నారు. వర్షం వస్తే ఈ రోడ్డుపై నడవడం నరకప్రాయంగా మారుతోంది. కాలనీవాసుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న అధికారుల తీరు మారాలి. వెంటనే రోడ్డు పనులు పూర్తి చేయకపోతే కాలనీవాసులతో కలిసి పెద్ద ఎత్తున కలెక్టరేట్‌ను ముట్టడిస్తాం.

# గ్రామాభివృద్ధికి కృషి

## సర్పంచ్ కొట్టం నరేందర్ రెడ్డి



**కేశంపేట మే 27 (జనం సాక్షి ) :** మంగలిగూడ గ్రామ అభివృద్ధికి గ్రామపంచాయతీ పాలకవర్గంతో కలిసి తన వంతు కృషి చేస్తానని సర్పంచ్ కొట్టం నరేందర్ రెడ్డి అన్నారు. గ్రామంలో సిసి రోడ్డు నిర్మాణ పనులను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహకారంతో గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొట్టం నారాయణరెడ్డి, కొట్టం అనిల్ రెడ్డి పాల్గొన్నారు.

# డ్రైనేజ్, వాటర్ లైన్ సమస్యల పరిష్కారానికి జలమండలి ఎండిని కలిసిన గజ్జి భాస్కర్ యాదవ్



**హయత్ నగర్, మే 27 (జనం సాక్షి )** హయత్ నగర్ డివిజన్ లోని ఉన్న వివిధ కాలనిలకు సంబంధించిన డ్రైనేజ్, వాటర్ లైన్ కోసము టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్, ఎల్బీనగర్ ఇంచార్జ్ మధు యాష్కి గౌడ్ ఆదేశాల మేరకు తెలంగాణ యాదవ్ కో-ఆపరేటివ్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ గజ్జి భాస్కర్ యాదవ్ జలమండలి ఎం డి అశోక్ రెడ్డి ఐఏఎస్ ను వారి కార్యాలయంలో కలిసి హయత్ నగర్ డివిజన్ లోని వివిధ కాలనీలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వారికి వివరించారు. గతంలో ఇచ్చిన కాలనీల ఎస్టిమేషన్ మంజూరు చేయమని కోరారు. వెంటనే వారు స్పందించి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

# శరవేగంగా కొనసాగుతున్న కోహెడ మార్కెట్ శంకుస్థాపన పనులు



**అబ్దుల్లాపూర్మెట్, మే 27 (జనం సాక్షి):** అబ్దుల్లాపూర్ మెట్టు మండల కోహెడ ప్రాంతంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించనున్న నూతన సమీకృత మార్కెట్ శంకుస్థాపన కార్యక్రమానికి సంబంధించిన పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. జూన్ 3వ తేదీన తెలంగాణ ముఖ్యమంత్రి హాజరుకానున్న నేపథ్యంలో మార్కెట్ పాలకవర్గం ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షిస్తోంది. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ కోహెడ ప్రాంతంలో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో సమీకృత మార్కెట్ నిర్మాణం జరగడం ప్రాంత ప్రజలకు గర్వకారణమన్నారు. మార్కెట్ నిర్మాణంతో రైతులు, వ్యాపారులు, వినియోగదారులకు ఆధునిక సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటనను పురస్కరించుకుని అధికారులు, సిబ్బంది ఏర్పాట్లను వేగవంతం చేస్తున్నారని పేర్కొన్నారు. కోహెడ ప్రాంత అభివృద్ధికి ఈ మార్కెట్ కీలక మైలురాయిగా నిలుస్తుందని స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో పార్టీ కార్యకర్తలు చురుకుగా పాల్గొనాలి కళ్లెం నవజీవన్ రెడ్డి




**హయత్ నగర్, మే 27 (జనం సాక్షి)** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు మంగళవారం రాత్రి హయత్ నగర్ లోని మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి నివాసంలో సర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమం పై ముఖ్య సమావేశం హయత్‌నగర్ డివిజన్ అధ్యక్షులు గంగాని శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కళ్లెం నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు సర్ కార్యక్రమాన్ని ప్రతి బూత్ స్థాయికి తీసుకెళ్లి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో పార్టీ కార్యకర్తలు చురుకుగా పాల్గొని, అర్హులైన ప్రతి ఓటరు పేరు నమోదు అయ్యేలా కృషి చేయాలని సూచించారు. పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో పార్టీ చేపట్టే కార్యక్రమాల్లో అందరూ సమన్వయంతో పాల్గొని పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తూ, సర్ కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయడానికి అవసరమైన కార్యాచరణపై చర్చించారు. ప్రతి బూత్‌లో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కళ్లెం రవీందర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి భాస్కర్, హయత్ నగర్ ప్రభారీ కొత్త రవీందర్ గౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఉగాది ఎల్లప్ప, జిల్లా ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి పారంద మహేష్, డివిజన్ ప్రధాన కార్యదర్శి గోవింద చారి, హయత్‌నగర్ డివిజన్‌కు చెందిన జిల్లా నాయకులు, వివిధ మోర్చాల అధ్యక్షులు, శక్తి కేంద్ర ఇంచార్జీలు, బూత్ అధ్యక్షులు, బూత్ కమిటీ సభ్యులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నల్లవెల్లిలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి యాచారం ఎంపీడీఓ రాధారాణి



**యాచారం, మే 27 (జనం సాక్షి ):** మండల పరిధిలోని నల్లవెల్లి గ్రామంలో కొనసాగుతున్న పలు ప్రభుత్వ అభివృద్ధి పనులను యాచారం మండల పరిషత్ అభివృద్ధి అధికారి రాధారాణి బుధవారం పరిశీలించారు. గ్రామంలోని వివిధ నిర్మాణ పనుల పురోగతిని ఆమె క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం ఈజీఎస్ పనులను, నిర్మాణంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్ర భవనాన్ని పరిశీలించారు. వీటితో పాటు స్వచ్ఛ భారత్ కార్యక్రమాల నిర్వహణను మరియు వివో భవన నిర్మాణ పనుల స్థితిగతులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనుల్లో ఎలాంటి జాప్యం జరగకుండా, నిర్దేశిత గడువులోగా నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని ఆమె సంబంధిత సిబ్బందిని, కాంట్రాక్టర్లను ఆదేశించారు. ప్రజాప్రయోజనాల దృష్ట్యా ఈ భవనాలు, పనులు పూర్తి చేసి త్వరగా అందుబాటులోకి రావాలని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శి, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

# అమ్మపల్లి ఆలయంలో హుండీ చోరీ

**శంషాబాద్, మే27(జనం సాక్షి)** శంషాబాద్ మండలం నర్కూడ గ్రామ పరిధిలోని అమ్మపల్లి ఆలయంలో హుండీ చోరీ జరిగిన ఘటన వెలుగులోకి వచ్చింది. ఆలయ ప్రధాన అర్చకుడు చెగొమ్మ సత్యనారాయణ మూర్తి ఫిర్యాదు మేరకు శంషాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇన్స్పెక్టర్ నరేందర్ రెడ్డి వివరాల ప్రకారం మే 26 రాత్రి ఆలయ పూజా కార్యక్రమాలు ముగిసిన అనంతరం ఆలయానికి తాళాలు వేసి అర్చకుడు ఇంటికి వెళ్లారు. మే 27 ఉదయం ఆలయానికి వచ్చి చూడగా ప్రధాన ద్వారాల తాళాలు పగులగొట్టబడినట్లు గుర్తించారు. ఆలయంలో ఉన్న చిన్న హుండీ కనిపించకపోవడంతో బయట వెతికితే మండపం సమీపంలో హుండీ పగిలిన స్థితిలో ఖాళీగా కనిపించింది. హుండీలో సుమారు రూ.5 వేల నగదు ఉన్నట్లు తెలిపారు. గుర్తుతెలియని వ్యక్తులు ఆలయంలోకి చొరబడి హుండీని అపహరించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

# కాలనీల్లో భద్రతకు 'మీ సురక్ష' అస్త్రం.. అప్రమత్తంగా ఉండాలి: అల్వాల్ సీఐ



**అల్వాల్, మే 27(జనంసాక్షి):** నేరాల నియంత్రణ, ప్రజల భద్రతే లక్ష్యంగా అల్వాల్ పోలీసుల ఆధ్వర్యంలో హస్మత్‌పేట్ పరిధిలోని సత్యసాయి కాలనీలో బుధవారం 'మీ సురక్ష' అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అల్వాల్ సీఐ మాట్లాడుతూ.. కాలనీల్లో నివసించే ఇరుగుపొరుగు వారు, వృద్ధులు, గృహ సహాయకులు, వాచ్ మెన్, డ్రైవర్లు, అద్దెకుండేవారి వివరాలను తప్పనిసరిగా 'మీ సురక్ష' యాప్‌లో నమోదు చేయించాలని కోరారు. ఈ సమాచారం నేరాల నివారణకు, అవాంఛనీయ సంఘటనలు జరిగినప్పుడు పోలీసులు సత్వరమే దర్యాప్తు చేపట్టి నిందితులను పట్టుకోవడానికి ఎంతగానో దోహదపడుతుందని వివరించారు. ఇళ్ల దొంగతనాల నివారణకు సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని, ఊళ్లకు వెళ్లేటప్పుడు విలువైన వస్తువులను ఇళ్లలో ఉంచకుండా జాగ్రత్తలు వహించాలని సూచించారు. కాలనీల్లో అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ప్రస్తుతం పెరుగుతున్న ఆన్‌లైన్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ స్పష్టం చేశారు. నకిలీ పెట్టుబడులు, వాట్సాప్, ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాల హ్యాకింగ్, నకిలీ కస్టమర్ కేర్ కేంద్రాల పేరిట వచ్చే మోసపూరిత లింకులను నమ్మవద్దని హెచ్చరించారు. బ్యాంక్ వివరాలు, ఓటీపీలు, పాస్‌వర్డ్‌లను ఎవరితోనూ పంచుకోవద్దని.. ఒకవేళ మోసపోతే వెంటనే జాతీయ సైబర్ నేరాల సహాయక సంఖ్య 1930 కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. వీటితో పాటు వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని, మైనర్లకు వాహనాలు ఇవ్వద్దని స్పష్టం చేశారు. పోలీసుల ఆధ్వర్యంలో జరిగిన ఈ అవగాహన సదస్సుపై సత్యసాయి కాలనీ నివాసులు హర్షం వ్యక్తం చేశారు.

# తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలి

- బిజెపి పార్టీ అసెంబ్లీ ఇంచార్జ్ బంటు రమేష్
- రైతు గోస బీజేపీ భరోసా కార్యక్రమం



**బొంరాస్ పేట, మే 27 ( జనం సాక్షి):** రైతు గోస బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా బిజెపి నాయకుల బృందం బుధవారం మెట్లకుంట, బొంరాస్ పేట గ్రామాలలో ఏర్పాటుచేసిన ఐకెపి వారి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అకాల వర్షాల వల్ల తడిసిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం ఎలాంటి కొర్రీలు పెట్టకుండా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం మండల బిజెపి పార్టీ అధ్యక్షులు ఉప్పరి జగదీశ్వర్ సాగర్ ఆధ్వర్యంలో వరి ధాన్యం రైతుల బాధలు పట్టించుకోవాలని కోరుతూ తహసిల్దార్ కార్యాలయంలో ఆర్ఐ శిరీషకు వినతి పత్రం అందజేశారు. వివోఏల సమ్మెకు మద్దతు మండల కేంద్రంలో గత పది రోజులుగా తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నిరవదిక సమ్మె చేస్తున్న వివోఎలకు బుధవారం మండల బిజెపి పార్టీ నాయకులు మద్దతు తెలిపారు. ప్రభుత్వము వారి న్యాయపరమైన డిమాండ్లను అంగీకరించి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల బిజెపి పార్టీ అధ్యక్షుడు ఉప్పరి జగదీశ్వర్ సాగర్, ఓబిసి మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బాబయ్య నాయుడు, బిజెపి మండల నాయకులు ఉప్పు జగదీశ్వర్, ముకుందం, రాజారామ్ రెడ్డి,మల్లేశం, జనార్ధన్, అనిల్ నాయక్, గణేష్ నాయక్,రాజు నాయక్, మహేందర్ గౌడ్, యాదగిరి, సుధాకర్ నాయక్, నారాయణ,శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుంది :చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య



**చేవెళ్ల, మే 27 (జనంసాక్షి)** మహిళల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని, రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతుందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య తెలిపారు. బుధవారం చేవెళ్ల మున్సిపల్ పట్టణ కేంద్రంలో మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళకు చీరలను అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం నిరంతరం పని చేస్తుందన్నారు. చేవెళ్ల నియోజకవర్గానికి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకునేందుకు 3500 ఇండ్లు మంజూరు అయ్యాయని అన్నారు. అర్హులైన ప్రజలు ఇందిరమ్మ ఇండ్లను నిర్మించుకోవాలని సూచించారు. మహిళల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందన్నారు. ఇందిరమ్మ చీరలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల మున్సిపల్ చైర్పర్సన్ సమతావెంకట్ తీవఎంఎ, వైస్ చైర్మన్ రాములుగౌడ్, మున్సిపల్ కమిషనర్ యాదగిరి, కౌన్సిలర్లు బండారి శైలజాఅగి రెడ్డి, కళ్యాణి యాదగిరి, మద్దెల శ్రీనివాస్, గోపాల్ రెడ్డి, పైండ్ల మధుసూదన్ రెడ్డి, మాధవి, డి. శ్రీనివాస్ రెడ్డి, తాళ్ళపల్లి నర్సింహులు, సొసైటీ చైర్మన్ లు దేవర వెంకట్ రెడ్డి, గోనె ప్రతాప్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్య గౌడ్, వైస్ చైర్మన్ రాములు, మల్గారీ జనార్ధన్ రెడ్డి, పడాల ప్రభాకర్, టేకులపల్లి శ్రీనివాస్, శ్రీనివాస్ గౌడ్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు తదితరులు ఉన్నారు.

# మహిళల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం: చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య



**శంకర్ పల్లి, మే 27(జనంసాక్షి)** శంకర్‌పల్లి మున్సిపాలిటీ కార్యాలయంలో మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేసిన స్థానిక చేవెళ్ల శాసనసభ్యులు శ్రీ కాలే యాదయ్య గారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మహిళల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. మరియు అర్హులైన ప్రతి మహిళకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు చేరేలా కృషి చేస్తున్నామనిపేర్కొన్నరు. అనంతరం లబ్ధిదారులకు ఇందిరమ్మ చీరలను అందజేసి మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. కమిషనర్ యోగేష్, వైస్ చైర్ పర్సన్ జూలకంటి స్వేత పాండురంగారెడ్డి, కౌన్సిలర్స్, మహిళలు, ప్రజాప్రతినిధులు పార్టీ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## రమాభాయి అంబేడ్కర్ 91వ వర్ధంతి సందర్భంగా నివాళులు

**రాజేంద్రనగర్,మే27(జనంసాక్షి) :** హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో భారత రత్న డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ సతీమణి రమాభాయి అంబేడ్కర్ గారి 91వ వర్ధంతి సందర్భంగా కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర బీజేపీ ఎస్సీ మోర్చా అధ్యక్షుడు క్రాంతి కిరణ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు ముఖ్య అతిథిగా పాల్గొని రమాభాయి అంబేడ్కర్ సేవలను స్మరించుకుని నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతం రావు, దాసరి మల్లేష్, పాపారావు, గోల్కొండ గోషామహల్ జిల్లా ఇన్‌చార్జ్ వై. శ్రీధర్, రాజేంద్రనగర్ డివిజన్ ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి ఈ. వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## ఐకెపి వివోఎలా సమ్మె ఒప్పందాలు వెంటనే అమలు చేయాలి



**నవాబుపేట్ మే 27 (జనంసాక్షి)** : వివోఏల కు ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చాలి. వివోఏళ్లకు గౌరవ వేతనాన్ని 26,000 ఇవ్వాలి అంటూ నవాబుపేట మండల కేంద్రంలో ఐకెపిల వివోఏల సమ్మె 10 రోజు సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు మహిపాల్ సమ్మెకు మద్దతు తెలుపుతూ మాట్లాడడం జరిగింది. ప్రభుత్వం ఇచ్చే 5000 గౌరవ వేతనం ఆటో చార్జీలే అవుతున్నాయని వారు డిమాండ్ చేశారు. ఇచ్చే ప్రభుత్వం ఇచ్చే 5000 రూపాయలు కూడా సంఘాల గ్రూపులో కాకుండా వివో ఏ లకు వారి అకౌంట్లో వేయాలని వారు తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం ఐకెపి వివో లకు ఇచ్చిన హామీలు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు 26,000 పెంచాలి ఈఎస్ఐ,పిఎఫ్,ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలి గౌరవ వేతనం వద్దు, కనీస వేతనం అమలు చేయాలి. ప్రభుత్వం ఫోన్ టబులు ఇచ్చరూ సిమ్ములు మర్చిపోయారు. ప్రభుత్వం కొత్త ఫోన్లు ఇవ్వాలి. ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలి ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వానికి డిమాండ్ చేస్తున్నాము అన్నారు ఈ కార్యక్రమంలో ఐకెపివోలు మండల అధ్యక్షులు జయమ్మ కార్యదర్శి జగన్, కమిటీ సభ్యులు కాలప్ప మహేంద్ర, స్వప్న, నాగరాణి, రమాదేవి, సుజాత, విమల, నాగరాణి, సుజాత, గాయత్రి, శోభ, సుగుణ, సుమలత, కవిత, రాజ్యలక్ష్మి,పాల్గొన్నారు

## ఇండ్లపై నుంచి విద్యుత్ 11 కెవి లైన్ ఏర్పాటు చేయవద్దు



**చేవెళ్ల, మే 27(జనంసాక్షి) :** ఇండ్లపై నుంచి విద్యుత్ హెవి లైన్ ఏర్పాటు చేయడం వెంటానే మానుకోవాలని కమ్మెట గ్రామస్తులు డిమాండ్ చేశారు. బుధవారం చేవెళ్ల మండలంలోని కమ్మెట గ్రామస్తులు గోపాల్, శ్రీధర్ ఆద్వర్యంలో గ్రామస్తులు చేవెళ్ల మండల విద్యుత్ ఏఈ కార్యాలయంలో వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. కమ్మెట గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న విద్యుత్ ట్రాన్సా ఫార్మార్ కోసం ఇండ్ల పై నుంచి 11 కెవి విద్యుత్ లైన్ వేసేందుకుగాను విద్యుత్ సిబ్బంది ఇప్పటికే విద్యుత్ సాంబాలు పాతారని గుర్తు చేశారు. ఇండ్లపై నుంచి విద్యుత్ లైన్ ఏర్పాటు చేస్తే ప్రమాదాలు జరిగే ప్రమాదం ఉందన్నారు. విద్యుత్ అధికారులు వెంటానే స్పందించి ఇండ్లపై నుంచి విద్యుత్ లైన్ ఏర్పాటు చేయోద్దని కోరారు. లేనిచో ఆంధోళన చేస్తామని హెచ్చరించారు. ఇదే విషయమైన చేవెళ్ల మండల విద్యుత్ ఏఈ రాజేందర్‌ను వివరణ కొరగా గ్రామస్తుల డిమాండ్ మేరకు ఇండ్ల పై నుంచి విద్యుత్ లైన్ ఏర్పాటు చేయాబోమన్నారు. తక్షణమే అక్కడి నుంచి లైన్ మరోచోటకు మారుస్తామని ఏఈ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

# మేధావుల నోరు నొక్కడం అహంకారం

### ప్రొఫెసర్ నాగేశ్వర్' ఉదంతంపై తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం డివిజన్ కన్వీనర్ శ్రీను నాయక్



**ఫరూఖ్‌నగర్ (జనంసాక్షి) :** తమ ప్రభుత్వంపై విమర్శలు చేయకూడదని, భిన్నమైన అభిప్రాయాలు చెప్పకూడదనే అహంకారంతో మేధావుల నోరు నొక్కేందుకు ఆంధ్రప్రదేశ్ అధికార పక్ష నాయకులు, పోలీసులు ప్రయత్నించడం అప్రజాస్వామికమని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం డివిజన్ కన్వీనర్ శ్రీను నాయక్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రముఖ రాజకీయ విశ్లేషకులు, జర్నలిస్టు, మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కె. నాగేశ్వర్ పై అక్రమంగా కేసు నమోదు చేసి, అరెస్ట్ చేయడానికి ఆంధ్రప్రదేశ్ పోలీసులు ప్రయత్నస్తున్నారని వారు విమర్శించారు. ఏపీ పోలీసులు చేస్తున్న ఈ అక్రమ అరెస్ట్ ప్రయత్నాలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అడ్డుకోవాలనీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర డీజీపీ వెంటనే జోక్యం చేసుకుని నాగేశ్వర్ కు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.రాజకీయ విశ్లేషకులు సమాజంలో జరిగే పరిణామాలను, తమకు ఉన్న సమాచారాన్ని బట్టి విశ్లేషించడం, ప్రజా బాహుళ్యంలో చర్చలు చేయడం సహజమైన విషయమని తెలిపారు. మేధావులు, విశ్లేషకులు ప్రజా సమస్యలపై మాట్లాడితే, ప్రభుత్వాలు, ప్రతిపక్షాలు వాటిని అర్థం చేసుకుని,లోపాలను సరిదిద్దుకునే వైఖరితో వ్యవహరించాలని సూచించారు. అలా కాకుండా అక్రమంగా అరెస్టులకు దిగడం రాజ్యాంగ విరుద్ధమని తప్పుపట్టారు. తప్పుడు కేసులు పెట్టి, జైళ్లకు పంపిస్తామంటూ భయభ్రాంతులకు గురి చేయడం సరికాదని పేర్కొన్నారు. ప్రశ్నించే గొంతుకైన నాగేశ్వర్ ను అరెస్ట్ చేస్తే జరిగే పరిణామలకు ప్రభుత్వాలు బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు.

# యాలాలలో కొత్త రోడ్డుకు అడుగులు

### సర్పంచ్, కాంగ్రెస్ నేతల సమక్షంలో అధికారుల సర్వే
### శివ సార్ ప్రాజెక్టు నుండి గోవిందరావు పేట చెక్ డ్యామ్ వరకు ఫార్మేషన్ రోడ్డు , రైతులకు కలిసొచ్చే మార్గం



**యాలాల మే 27(జనంసాక్షి)** : వికారాబాద్ జిల్లా యాలాల మండల కేంద్రంలో శివసాగర్ ప్రాజెక్టు నుండి గోవిందరావు పేట చెక్ డ్యామ్ వరకు ప్రతిపాదిత ఫార్మేషన్ రోడ్డు నిర్మాణం కోసం అధికారులు, ప్రజాప్రతినిధులు బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ పరిశీలనలో అసిస్టెంట్ ఇంజనీర్ (ఎఈ), డిప్యూటీ ఇంజనీర్ (డిఈ) లతో పాటు గ్రామ సర్పంచ్ సిహెచ్. శివయ్య, యాలాల మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు పేరి రాజేందర్ రెడ్డి , గ్రామ పంచాయతీ సెక్రెటరీ ఆనందరావు పాల్గొన్నారు. అలాగే వికారాబాద్ జిల్లా మాజీ కో-ఆప్షన్ అధ్యక్షులు అక్బర్ బాబా, 10వ వార్డ్ సభ్యులు గడ్డం బస్వరాజ్, బుర్ణపూరి పాపయ్య, బుర్ణపూరి నర్సిములు, సత్యప్ప గౌడ్ మరియు స్థానిక రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. శివసాగర్ ప్రాజెక్టు నుండి గోవింద్రపేట్ చెక్ డ్యామ్ వరకు రోడ్డు ఏర్పాటు చేస్తే రైతులకు, గ్రామస్థులకు రవాణా సౌకర్యం మెరుగుపడు తుందని స్థానికులు అధికారులకు వివరించారు. రోడ్డు నిర్మాణానికి అవసరమైన చర్యలు త్వరగా చేపట్టాలని నాయకులు కోరారు. ఎఈ ,డీఈ లు ప్రతిపాదిత రోడ్డు అలైన్మెంట్, భూసేకరణ అంశాలను పరిశీలించి నివేదిక తయారు చేస్తామని తెలిపారు. ఈ రోడ్డు పూర్తయితే వ్యవసాయ ఉత్పత్తుల తరలింపుకు, ప్రాజెక్టు – చెక్ డ్యామ్ మధ్య కనెక్టివిటీకి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని రైతులు అభిప్రాయపడ్డారు.

## ఎస్ఐఆర్‌ను విజయవంతానికి ప్రత్యేక హెల్ప్ డెస్క్‌లు

### చేవెళ్ల ఆర్డీవో పార్థసింహారెడ్డి



**చేవెళ్ల, మే 27 (జనంసాక్షి)** : చేవెళ్ల నియోజకవర్గంలో ఎస్ఐఆర్ ను విజయవంతంగా అమలు చేయూటకు ప్రత్యేంగా హెల్ప్ డెస్క్ లు ఏర్పాటు చేసినట్లు చేవెళ్ల నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, చేవెళ్ల ఆర్డీవో పార్థసింహ రెడ్డి తెలిపారు. బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. చేవెళ్ల నియోజకవర్గంలో ఓటరు జాబితాలో పేరు నమోదు, సవరణలు, చిరునామా మార్పు, తొలగింపు ఇతర ఎన్నికల సంబంధిత సేవల కోసం ప్రజలకు సులభంగా సమాచారం అందించేందుకు మండల, మున్సిపాలిటీ స్థాయిలో ప్రత్యేక హెల్ప్ డెస్కు ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రజలు తమ పరిధిలోని హెల్ప్ డెస్క్ అధికారులను సంప్రదించి ఎన్నికల సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎన్నికల అధికారుల ఆదేశాల మేరకు చేవెళ్ల నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన హెల్ప్డెస్క్ అధికారులు వివరాలు ఇలా ఈఆర్వో బి.పాడు (చేవెళ్ల 9949464544), ఎస్.సునీత (శంకర్పల్లి మండల్ 7337534765), కె. మహేందర్ (శంకర్పల్లి మున్సిపాలిటీ 9959495241), బి. నర్సింలు (చేవెళ్ల మండల్, 7981350260), పాలిటీ 9121810022), బి. యెల్లయ్య (మొయినాబాద్ మండల్ 7730881221), ఎస్. నరేందర్ (మొయినాబాద్ మ రాధా (చేవెళ్ల మున్సి న్సిపాలిటీ 9866517187), నరేష్ (షాబాద్ 7981117362), జ్యోతి (నవాబ్ పెట్ 9133888408) ప్రజలు అవసరమైన సమాచారం కోసం పై అధికారులను సంప్రదించాలని ఆర్డీవో సూచించారు.



## రూ.200 కోట్లతో 'మరకత గణపతి' ఆలయ విస్తరణ

### నిత్యకల్యాణ మండపం, కోనేరు, గోశాల ఏర్పాటు
### దేవస్థానం వ్యవస్థాపకులు డాక్టర్ మోత్కూరు సత్యనారాయణ శాస్త్రి

**అల్వాల్, మే 27 (జనంసాక్షి):** ఖానాజీగూడలో కొలువైన అత్యంత అరుదైన మరకత శ్రీ లక్ష్మీ గణపతి దేవస్థానాన్ని భక్తుల సౌకర్యార్థం సుమారు రూ. 200 కోట్ల అంచనా వ్యయంతో విస్తరించనున్నట్లు ఆలయ వ్యవస్థాపకులు, నిర్వాహకులు డాక్టర్ మోత్కూరు సత్యనారాయణ శాస్త్రి తెలిపారు. బుధవారం వేకువజామున ఆలయంలో స్వామివారికి సుప్రభాత సేవ, ప్రత్యేక పూజలు, హోమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అత్యంత మహిమాన్వితమైన మరకత (పచ్చ) గణపతి స్వామివారి దర్శనం సకల పాప వినాశనమని, మహా మంగళప్రదమని పేర్కొన్నారు. రోజురోజుకూ పెరుగుతున్న భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ విస్తరణకు సంకల్పించినట్లు చెప్పారు. ఇందులో భాగంగా అత్యాధునిక వసతులతో కూడిన అన్నప్రసాద భవనం, నిత్యకల్యాణ మండపం, పవిత్ర కోనేరు, భక్తుల కొరకు వసతి గృహాలు, గోశాల ఏర్పాటుకు త్వరలోనే అడుగులు వేస్తున్నామని వివరించారు. ఈ ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.





## బీఆర్ఎస్ పార్టీ బోడుప్పల్ సర్కిల్ బూత్ కమిటిసమావేశాన్ని జయప్రదం చేయాలి

### పార్టీ శ్రేణులకు మంద సంజీవరెడ్డి పిలుపు

**బోడుప్పల్-జనంసాక్షి :** బోడుప్పల్ సర్కిల్ పరిధిలో బీఆర్ఎస్ పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేసే ప్రక్రియలో భాగంగా 28 తేదీ గురువారం ఉదయం చెంగిచర్ల చౌరస్తాలోని తులీప్ గ్రాండ్ హోటల్లో నిర్వహించనున్న బూత్ కమిటీ సమావేశాన్ని జయప్రదం చేయాలని బోడుప్పల్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మందసంజీవరెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో మంద సంజీవరెడ్డి మాట్లాడుతూ.. బోడుప్ప సర్కిల్ పరిధిలోని బోడుప్పల్, చెంగిచర్ల, మేడిపల్లి, పీర్జాదిగూడ డివిజన్లకు చెందిన పార్టీ ప్రతినిధులతో నిర్వహించనున్న కార్యక్రమంలో సర్ ఓటర్ల పరిశీలన, పార్టీ సభ్యత్వాల, బూత్ లెవల్ కమిటి ఎంపిక వంటి అంశాలపై దిశానిర్దేశం చేస్తారన్నారు. ఈ సమావేశాన్ని జయప్రదం చేసేందుకు బోడుప్పల్, చెంగిచర్ల డివిజన్లకు మాజీ మేయర్ సామల బుచ్చిరెడ్డి, కొత్త చక్రపాణిగౌడ్. జడిగె రమేశ్ యాదవ్, బందారం శ్రీధర్ గౌడ్. రవికుమార్, కొత్త రవిగౌడ్. మీసాల కృష్ణ, ఏనుగు ప్రతాప్రెడ్డి, కాటం రాజిరెడ్డి,బింగి శ్రీకాంత్ యాదవ్లు ఇన్చార్జిలుగా వ్యవహరిస్తారన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మేడ్చెల్ నియోజక వర్గ బూత్ కమిటీల ఇన్చార్జి రాగి లక్ష్మారెడ్డి, మేడ్చెల్ బీఆర్ఎస్ పార్టీ ఇన్చార్జి చామకూర మ హేందర్ రెడ్డిలు హాజరవుతారన్నారు. ఈ సమావేశాన్ని దిగ్విజయం చేసేందుకు ఉద్యమకారులు, పార్టీ శ్రేణులు భారీగా తరలిరావాలని మంద సంజీవరెడ్డి పిలుపునిచ్చారు. విలేకర్ల సమావేశంలో సీనియర్ నాయకులు కాటపల్లి రామచంద్రారెడ్డి, దీటి గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

## నార్సింగ్ సర్కిల్లో నీటి సమస్యలపై ఎమ్మెల్యే సమీక్ష



**రాజేంద్రనగర్,మే27(జనంసాక్షి) :** నార్సింగ్ సర్కిల్ పరిధిలోని అన్ని డివిజన్లలో మంచినీటి సరఫరా సక్రమంగా జరిగేలా చూడాలని ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్బీ అధికారులను ఆదేశించారు. వేసవి కారణంగా బోర్లలో నీటి మట్టం తగ్గడంతో కొన్ని ప్రాంతాల్లో నీటి కొరత ఏర్పడిన నేపథ్యంలో ప్రతి ఇంటికి సకాలంలో తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని ఫోన్ ద్వారా అధికారులతో మాట్లాడారు. ప్రత్యేకంగా మణికొండ, నెక్నాంపూర్ డివిజన్లలో నీటి సమస్య ఉన్నట్లు గుర్తించిన ఎమ్మెల్యే, అక్కడ నీటి సరఫరా సమయాన్ని తగ్గించకుండా ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. అలాగే మణికొండ, నెక్నాంపూర్ ప్రాంతాల్లో జనాభా పెరుగుతున్న నేపథ్యంలో ట్రాఫిక్ సమస్యలు, రోడ్ల విస్తరణ అంశాలపై స్థానిక నాయకులతో చర్చించారు. సమావేశంలో రామకృష్ణ రెడ్డి, బూదోలు శ్రీరాములు, బాల్రెడ్డి, ఏర్పుల కుమార్, శ్రవణ్ కుమార్, శ్రీపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## గ్రామాల్లో సీసీ కెమెరాలు బిగించి శాంతి భద్రత పరిరక్షణ కృషి చేయాలి

**మోమిన్ పేట మే 27 (జనంసాక్షి) :** గ్రామాల్లో విధుల గుండా సిసి కెమెరాలు బిగించి దొంగతనాలు నివారణకు శాంతి పరిరక్షణకు చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత గ్రామ సర్పంచులపై ఉందని వికారాబాద్ డీఎస్పీ అంజయ్య పేర్కొన్నారు, బుధవారం మోమిన్ పేట వివిధ గ్రామాల సర్పంచులు వికారాబాద్ జిల్లా డి.ఎస్.పి అంజయ్యని మర్యాదపూర్వకంగా కలిసిన సైదుల్లాపూర్ గ్రామ సర్పంచ్ జైపాల్ సైదుల్లాపూర్ గ్రామానికి చెందిన డిసిసిబి బ్యాంకు మేనేజర్ నారాయణ రెడ్డి, చంద్రయన్ పల్లి గ్రామ సర్పంచ్ కోసిగి శివకుమార్ మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది.

## పోగొట్టుకున్న సెల్ఫోన్లను బాధితులకు అప్పగింత



**మర్పల్లి మే 27 (జనంసాక్షి) :** వికారాబాద్ జిల్లా మర్పల్లి మండల పరిధిలోని పట్లూరు గ్రామానికి చెందిన బోయిని శివకుమార్, సిరిపురం గ్రామానికి చెందిన హైమద్, మోమిన్ పేట మండలం ఎంకతల గ్రామానికి చెందిన మధు కిరణ్ లు 9 నెలల క్రితం సెల్ఫోన్లను పోగొట్టుకున్నారు. పోయిన వెంటనే మర్పల్లి మండల పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పోలీసులు సి ఈ ఐ ఆర్ పోర్టల్ ద్వారా ట్రాక్ చేసి పోయిన సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న సెల్ఫోన్లను బుధవారం మర్పల్లి పోలీస్ స్టేషన్లో ఎస్సై అబ్దుల్ రవూఫ్ బాధితులకు అప్పగించారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ పరమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## హెచ్సీఏ టీ20లో సౌత్ సెంట్రల్ రైల్వేస్ ఘన విజయం

### 42 బంతుల్లో 74 పరుగులు చేసి సత్తా చాటిన నిహాల్ రెడ్డి



**సికింద్రాబాద్ (జనంసాక్షి):** హెచ్సీఏ టీ20 లీగ్లో సౌత్ సెంట్రల్ రైల్వేస్ జట్టు అద్భుత విజయాన్ని సాధించింది. నెక్స్జెన్ క్రికెట్ అరేనాలో జరిగిన మ్యాచ్లో కంబైన్డ్ డిస్ట్రిక్ట్-2 జట్టుపై రైల్వేస్ జట్టు విజయ ధంకా మోగించింది. కంబైన్డ్ డిస్ట్రిక్ట్-2 జట్టుపై సౌత్ సెంట్రల్ రైల్వేస్ జట్టు 19 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 172 పరుగులు చేసి విజయాన్ని సాధించింది. రైల్వేస్ జట్టులో అద్భుత బ్యాటింగ్ చేసిన తన ప్రతిభ చాటిన నిహాల్ రెడ్డి 42 బంతుల్లో 74 పరుగులు చేసి జట్టుకు విజయాన్ని అందించడంలో కీలక పాత్ర పోషించాడు. నిహాల్ రెడ్డి ఇన్నింగ్స్లో 6 ఫోర్లు, 5 సిక్సర్లు ఉన్నాయి. కెప్టెన్ సిగినేని ధృవ కుమార్ రెడ్డి వేగంగా 20 పరుగులు చేసి జట్టుకు శుభారంభం అందించాడు. కీలక సమయంలో బ్యాటర్లు సమిష్టిగా రాణించడంతో సౌత్ సెంట్రల్ రైల్వేస్ జట్టు లక్ష్యాన్ని విజయవంతంగా చేదించింది. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో సమతూక ప్రదర్శన కనబర్చిన రైల్వేస్ జట్టు టోర్నీలో మరో విజయాన్ని ఖాతాలో వేసుకుని సత్తా చాటింది.

## డ్రగ్స్పై ఉక్కు పాదం

### షాబాద్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కాంతారెడ్డి



**షాబాద్, మే 27 (జనంసాక్షి):** డ్రగ్స్ సమాజాన్ని నాశనం చేసే ప్రమాదకరమైన వ్యసనమని యువత మత్తు పదార్థాల బారిన పడకుండా తగిన చర్యలు చేపడుతున్నామని షాబాద్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కాంతారెడ్డి అన్నారు. మండల పరిధిలోని అంతారం, సంకెపల్లి గూడ లో బుధవారం ఈగల్ టీం తెలంగాణ పోలీస్, డాగ్ స్క్వాడ్ ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ తో కలిసి ప్రత్యేక చర్యలు చేపట్టి, తనిఖీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ... అనుమానాస్పద వ్యక్తులు కనబడితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. డ్రగ్స్ సరఫరా, వినియోగం, రవాణా పై కఠినమైన ఏర్పాటు చేసి అనుమానాస్పద వ్యక్తులపై తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యువత చెడు అలవాట్లకు బానిసలు కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రామ్ లాల్, కానిస్టేబుల్ పాండు పాల్గొన్నారు.



## ఘనంగా మాతా రామాబాయి అంబేద్కర్ జయంతి వేడుకలు

**జవహర్నగర్, మే 27 (జనంసాక్షి) :** బాలాజీనగర్లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం సమీపంలో స్వర్గీయ మాతా రామాబాయి అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు మరాఠీ బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. స్వర్గీయ మాతా రామాబాయి అంబేద్కర్ చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. బీజేపీ చంద్రపురి కాలనీ డివిజన్ అధ్యక్షులు కర్లపూడి జోగారావు, జవహర్ నగర్ అధ్యక్షులు కమలాకర్, కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకులు మహిపాల్ రెడ్డి, డాక్టర్ యాదగిరి, ముచ్చర్ల యాదగిరి, దయాకర్, సాయి, క్రాంతి, రాజు, నరేష్ తదితరులు పాల్గొన్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జీవిత ప్రయాణంలో మాతా రామాబాయి పాత్ర ఎంతో విశిష్టమైనదని పేర్కొన్నారు. అంబేద్కర్ విద్యాభ్యాసం, సామాజిక ఉద్యమాలు, దేశ సేవలో ముందుకు సాగేందుకు రామాబాయి ఎన్నో కష్టాలను భరిస్తూ కుటుంబ బాధ్యతలను నిర్వర్తించి ఆయనకు అండగా నిలిచారని కొనియాడారు. రామాబాయి త్యాగం, సహనం, సేవాభావం నేటి సమాజానికి ఆదర్శమని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ప్రజలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

## తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర లీగల్ సెల్ చైర్మన్గా కోమల సంతోష్ కుమార్ నియామకం



**హయత్నగర్, మే 27 (జనం సాక్షి) :** తెలంగాణ ఉద్యమకారుల వేదిక (టియువి)కు మలిదశ ఉద్యమకారుడు కోమల సంతోష్ కుమార్ ను తెలంగాణ రాష్ట్ర లీగల్ సేల్ చైర్మన్ గా నియమిస్తూ టియువి రాష్ట్ర చైర్మన్ నరాల సత్యనారాయణ, వైస్ చైర్మన్ తోడేటి శంకర్ గౌడ్లు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కోమల సంతోష్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో నిజమైన తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి, ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిజమైన ఉద్యమకారులకు అమలు చేసేంతవరకు పోరాడుతానని తెలిపారు. టి యు వి రాష్ట్ర లీగల్ సేల్ చైర్మన్ నన్ను నియమించినందుకు, చైర్మన్ సత్యనారాయణ, వైస్ చైర్మన్ శంకర్ గౌడ్, ఉద్యమకారులందరికీ పేరుపేరునా అభినందనలు తెలియజేస్తున్నాను.

# ఉచిత విద్య, వైద్యం టీఆర్ఎస్‌తోనే సాధ్యం

- మే 30న టీఆర్ఎస్ జెండా పండుగను విజయవంతం చేయండి
- తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీ చేవెళ్ల నియోజకవర్గం ఇన్చార్జి బేగరి రాజు
- తెలంగాణ జాగృతి బీసీ విభాగం రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కుమ్మరి శివశంకర్



**మొయినాబాద్, మే27, జనంసాక్షి:** ఉచిత విద్య, వైద్యం తెలంగాణ రక్షణ సేన పార్టీ అధికారంలోకి వస్తే  సాధ్యమవుతుందని, చేవేళ్ల నియోజకవర్గం ఇన్చార్జి బేగరి రాజు అన్నారు. బుధవారం మొయినాబాద్ మండల కేంద్రంలో తెలంగాణ రక్షణ సేన టీఆర్ఎస్ పార్టీ మొయినాబాద్ మండల ఇన్చార్జి ఎండీ.అన్వార్ ఖాన్, మేకగూడెం బిక్షపతి ఆధ్వర్యంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్బంగా తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీ చేవెళ్ల నియోజకవర్గం ఇన్చార్జి  బేగరి రాజు, తెలంగాణ జాగృతి బీసీ విభాగం రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కుమ్మరి శివశంకర్  మాట్లాడుతూ.. ఈనెల మే 20వ తేదీ నుండి జూన్ 20వ తేదీ వరకు రాష్ట్ర రాష్ట్రవ్యాప్తంగా జెండా పండుగ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని అందులో భాగంగానే మే 30న మొయినాబాద్ మండల కేంద్రంలో టీఆర్ఎస్ జెండా ఏర్పాటు చేయడం జరిగిందని ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితమ్మ వస్తున్నారని తెలియజేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ, పార్టీలకు చెందిన నాయకులు టీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని తెలిపారు. కల్వకుంట్ల కవితమ్మ  తీసుకున్న ఉచిత విద్య, వైద్యం, ఉపాధి, వ్యవసాయం,సామాజిక న్యాయం, హామీలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారని, టీఆర్ఎస్ పార్టీలో కష్టపడే వాళ్లకు మంచి స్థానం ఉంటుందని వారు గుర్తుచేశారు. మే 30న మొయినాబాద్ కేంద్రంలో టీఆర్ఎస్ జెండా పండుగ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన మొయినాబాద్ మున్సిపాలిటీ నాయకులు షేక్ మహ్మద్ నూర్ భాయ్, తెలంగాణ జాగృతి మొయినాబాద్ మండల అధ్యక్షులు సంగేరి  నాగేష్, తెలంగాణ రక్షణ సేన యూత్ అధ్యక్షులు కుమ్మరి పవన్, తెలంగాణ రక్షణ సేన మొయినాబాద్ మండల నాయకులు చాకలి విక్రం, కావలి శ్రీను ముదిరాజ్, బొక్క సురేందర్ రెడ్డి బొక్క రవీందర్ రెడ్డి, సంజీవరెడ్డి, మలని రాజు, చాకలి వినోద్ కుమార్, గాండ్ల సంతోష్ కుమార్, బోడ భాస్కర్, నాగారం కృష్ణ యాదవ్, పెద్దింటి శ్రీశైలం ముదిరాజ్, కావలి అమర్ యాదవ్, ఎండీ.అలీ, ఎండీ.ఇనాయత్, ఎండీ.ఏయా,ఎండీ.రాపిక్, షేక్ మమ్మద్ అమిత్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

## బదిలీ నిబంధనలను తుంగలో తొక్కుతున్న అధికారులు

**ముషీరాబాద్, మే 27 (జనంసాక్షి):** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలకు సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను, మార్గదర్శకాలను లక్ష్యం పెట్టకుండా కొంతమంది ఉన్నతాధికారులు తమ ఇష్టానికి తగ్గట్టు వ్యవహరిస్తున్నారని తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ (టీజీఈ జేఏసీ) తీవ్రంగా వ్యతిరేకించింది.

బుధవారం టీజీఈ జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాస్ రావు ఒక ప్రకటన విడుదల చేస్తూ, జీవో నెం.38 ద్వారా ప్రభుత్వం బదిలీలకు స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చినా, కొన్ని శాఖల ఉన్నతాధికారులు వాటికి వక్రభాష్యం చెబుతూ తమకు తోచినట్టు నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆరోపించారు. ఆర్థిక శాఖ, ఆయుష్, సంక్షేమ శాఖలు (ఎస్సీ, ఎస్టీ, బీసీ, ట్రైబల్ వెల్ఫేర్)లో 4 సంవత్సరాల సర్వీసు పూర్తి చేసుకున్నవారిని మాత్రమే బదిలీ చేయాలని, బదిలీలు 40 శాతం మించకూడదని స్పష్టమైన నిబంధనలు ఉన్నా, కొందరు అధికారులు 3 సంవత్సరాల సర్వీసు ఉన్నవారిని కూడా బదిలీ చేస్తున్నారని విమర్శించారు. ఎస్సీ డెవలప్‌మెంట్ కమిషనర్ ఉద్యోగ సంఘాల నాయకులకు ప్రభుత్వం కల్పించిన వెసులుబాట్లను ఇవ్వడానికి నిరాకరిస్తున్నారని, కేవలం అధ్యక్ష, కార్యదర్శులకు మాత్రమే మినహాయింపు ఇస్తున్నారని జేఏసీ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఆయుష్ డిపార్ట్‌మెంట్‌లో ఖాళీలు వెల్లడించకపోవడం, సీనియారిటీ లిస్టులు ప్రకటించకపోవడం, ఉద్యోగుల ఐచ్ఛికాలను స్వీకరించకపోవడం వంటి అనియమాలు జరుగుతున్నాయన్నారు.

మే 31వ తేదీలోగా బదిలీల ప్రక్రియ పూర్తి చేయాలని ప్రభుత్వం స్పష్టం చేసినా, ఆదాయం సముపార్జించే ఆబ్కారీ, వాణిజ్య పన్నుల శాఖల్లో బదిలీల ఊసే లేదని జేఏసీ నాయకులు ప్రశ్నించారు. ప్రభుత్వ ఉత్తర్వులను ఉల్లంఘించే అధికారులపై చర్యలు తీసుకోవాలని, అవసరమైతే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, చీఫ్ సెక్రటరీ దృష్టికి తీసుకెళ్లి ధర్నాలు, చట్టపరమైన చర్యలకు వెళ్తామని హెచ్చరించారు.

# శేరిలింగంపల్లిలో హైడ్రాకు జననీరాజనం

## ఇప్పటికే వేలకోట్ల రూపాయల భూమిని కబ్జాకోరల నుండి విడిపించిన వైనం

- భూముల పరిరక్షణలో 'జనంసాక్షి'ది క్రియాశీల సామాజిక పాత్ర
- సిపిఎం నేత చల్లా ది మరువలేని పాత్రే...




**శేరిలింగంపల్లి, మే 27 (జనంసాక్షి) :**
బిఏ ముహూర్తాన హైడ్రా శేరిలింగంపల్లిలో అడుగుపెట్టిందో తెలియదు కానీ... అడుగడుగునా సంచలనాలే! ఏ ఫిర్యాదును కదిలించినా వందల కోట్ల రూపాయల పై మాటే... ఇప్పటికే శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలో హైడ్రా సంస్థ పరిరక్షించిన భూముల విలువ అధికారికంగా 4 వేల కోట్ల రూపాయల పై మాటే అతిశయోక్తి కాదేమో! ఇక అనధికారికంగా ఆ మార్కెట్ విలువ ఇంకా ఎక్కువేనని శేరిలింగంపల్లి ప్రాంత విశ్లేషకులు విశదీకరిస్తున్న విషయం. దశాబ్దాలుగా శేర్లింగంపల్లి ప్రభుత్వ భూములకు, ప్రైవేటు భూములకు అంటుకున్న మఖిలీని హైడ్రా సంస్థ తుడిచిపారేస్తున్న తీరు పరోక్షంగా బాహుబలి' సినిమాను తలపిస్తోందని... అందుకే శేరిలింగంపల్లి ప్రజలు హైడ్రా సంస్థ రాక కోసం ఎంతో ఆసక్తితో ఎదురు చూడడంతో పాటు ఇప్పటివరకు హైడ్రా వ్యవహరించిన తీరుకు, చేపట్టిన ప్రక్షాళనకు, పరిరక్షించిన భూమి విషయంలో నిర్మోమాటంగా అశేష నిరాజనాలు పలుకుతుండడం తెలంగాణ రాష్ట్రం ఆలోచించాల్సిన విషయం!!బి

హైడ్రా చర్యలతో దాదాపు 40 ఎకరాలు... 4 వేల కోట్లు వెనక్కి!

2023 లో శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలో తన ప్రస్థానం ప్రారంభించిన హైడ్రా సంస్థ అనేక సంచలనాత్మక చర్యలకు దిగడం పదుల ఎకరాల సంఖ్యలో ప్రభుత్వ భూమిని తిరిగి స్వాధీనం చేసుకోవడం... అనేక సందర్భాలలో రాజకీయ ఒత్తిళ్లు, బడా బాబుల బెదిరింపులు, తెర వెనుక ప్రజాప్రతినిధుల కదలికలను సైతం బేఖాతరు చేస్తూ ఆఫీసులో నిర్దేశించుకుని వచ్చిన లక్ష్యాలను ఏమాత్రం వణుకు బెనుకు లేకుండా పూర్తిచేసి ఓవైపు ప్రభుత్వానికి వేల కోట్ల రూపాయలను ఆదా చేయడంతో పాటు మరోవైపు దళారులు, భూ కబ్జారాయుళ్ళ వెన్నులో వణుకు పుట్టిస్తూ స్థానికంగా సెన్సేషన్ హీరోగా ముద్రను ఆపాదించుకోవడం విశేషం. ఈదులకుంట, తుమ్మిడి కుంట, ఎన్ కన్వెన్షన్, ఖానా మెట్, సున్నం చెరువు, మత్త మహబూబ్పేట్, కొండాపూర్ ఆఫీస్ పెట్ తదితర ప్రాంతాలలోని ఎకరాల విలువైన భూమిని హైడ్రా కాపాడడంతోపాటు నియోజకవర్గ పరిధిలోని గంగారం చెరువు, సున్నం చెరువు, హఫీజ్ పేట్ పరిధిలోని చెరువుల శిఖం భూమినిసైతం తమకు అందిన ఫిర్యాదుల మేరకు పరిశీలించి పూర్తి ఆధారాలతో వాటిని తిరిగి స్వాధీనం చేసుకోవడమే కాకుండా మరో మారు అటువైపు దళారులు కన్నెత్తి చూడకుండా ఫెన్సింగ్ లను ఏర్పాటు చేయడంతో పాటు ఏకంగా ప్రభుత్వ భూమిలో బోర్డులను సైతం ఏర్పాటు చేస్తూ శేరిలింగంపల్లిలో భూకబ్జాకు పాల్పడాలంటేనే తాతలు దిగిరావలసిందిగా... మరోవిధంగా అదిరి చచ్చేలా హైడ్రా చర్యలు ఉండడం శేరిలింగంపల్లి ప్రజలకు ఎంతో ఊరటనిచ్చింది అనే విషయం అక్షరసత్యం. ఎక్కడ కబ్జాలు చోటు చేసుకున్నా... సమాచారం అందుకోవడం, తదనంతరం తగిన ఆధారాలను సేకరించి ఒకేసారి ఫీల్డ్ లోకి దిగడం, దానిని పూర్తిగా సెట్ చేయడం హైడ్రాక్ మాత్రమే చెల్లింది. స్థానికుల అంచనా ప్రకారం శేరిలింగంపల్లిలో ఇప్పటివరకు దాదాపు 40 ఎకరాలకు పైగా భూమిని స్వాధీనపరచుకున్న హైడ్రా మార్కెట్ అంచనా ప్రకారం 4 వేల కోట్ల రూపాయలకు పైగా వెనక్కి తీసుకొచ్చినట్లు స్పష్టమవుతుంది.




### సిపిఎం నేత చల్లా శోభన్ పాత్ర...

శేరిలింగంపల్లి నియోజకవర్గ సిఐటియు నేతగా, శేరిలింగంపల్లి జోన్ సిపిఎం కార్యదర్శిగా నిరంతరం ప్రజా పోరాటాలలో తలమునకలై ఉన్న చల్లా శోభన్ శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని ఆక్రమణలు, అక్రమ వ్యవహారాల విషయంలో నిర్మాణాత్మక పాత్రను పోషించారనేది కాదనలేని నిజం. ఎన్నో వ్యయ ప్రయాసాలు కోర్చి అనేక సందర్భాలలో కీలకమైన ఆధారాలను సేకరించడం, వాటిని మీడియా ద్వారా బాహ్య ప్రపంచానికి వివరించడం, హైడ్రాధికారులకు నేరుగా ఫిర్యాదులు చేస్తూ సమగ్రమైన సమాచారాన్ని అందిస్తూ అనేక భూముల పరిరక్షణ విషయంలో ప్రశంసనీయ పాత్రను పోషించడం విశేషం. తాజాగా రంగారెడ్డి జిల్లా ఖానా మెట్ రెవెన్యూ విలేజ్ పరిధి సర్వే నంబర్ 7 లో ఉన్న అత్యంత విలువైన ఈదులకుంట ప్రభుత్వ భూమిని పరిరక్షించడంలో ఇటు జనంసాక్షి, ఆటో సిపిఎం నేత చల్లా శోభన్ పాత్ర మరువలేనిదని ఖానా మేట్ వాసులు ముక్తకంఠంతో స్పష్టం చేస్తున్నారు.

### భూముల పరిరక్షణలో ఓవైపు 'జనంసాక్షి' మరోవైపు సిపిఎం పార్టీ...

శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలో హైడ్రా అనేక దాడులను కొనసాగించడానికి సామాజికవేత్తలు, ప్రజా సంఘాలు, ట్రేడ్ యూనియన్లు నిర్మాణాత్మక పాత్రను పోషించగా 'జనంసాక్షి' దినపత్రిక సైతం ఈ సామాజిక బాధ్యతను భుజాన ఎత్తుకొని అనేక విశ్లేషణాత్మక కథనాలను ప్రచురించడం ద్వారా పరోక్షంగా హైడ్రా పాత్రను మరింత సులభం చేసిందని స్థానికులు కొనియాడుతుండడం గమనార్హం. ఈదులకుంట, తుమ్మిడి కుంట, సున్నం చెరువు, గంగారం చెరువు, ఖానా మెట్, గచ్చిబౌలి పరిధిలోని అనేక అక్రమాల గురించి విశ్లేషణాత్మక వార్తా కథనాలను ప్రచురించడం, వాటిలో స్పష్టమైన ఆధారాలను పొందుపరచడంతో మీడియా కథనాలను పరిగణలోకి తీసుకున్న సందర్భంలో హైడ్రా సంస్థ లిజనంసాక్షిలి కథనాలను సైతం అనేక సందర్భాలలో వినియోగించినట్లు పలు ప్రజా సంఘాలు స్పష్టం చేస్తున్నాయి.